క్లుప్తంగా

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



పార్వతమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రాజు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 36వ వార్డు కాకర వీధికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు లోతేటి చిట్టి మాతృమూర్తి లోతేటి పార్వతమ్మ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు పార్వతమ్మ పార్థివ దేహానికి నివాళులర్పించి, ఆ కుటుంబానికి దహన సంస్కరణ ఖర్చుల కింద రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు పాల్గొన్నారు.

విదేశాల్లో వైద్య విద్య



మాట్లాడుతున్న సునీత లావణ్య

దాబాగార్డెన్స్: విదేశాల్లో ఎంబీబీఎస్ వైద్య విద్యను అందించడంలో ఐఎస్ఎం ఫోకల్ పాయింట్ సంస్థది అందె వేసిన చెయ్యి అని ఆ సంస్థ ప్రాంతీయ డైరెక్టర్ కె.సునీత లావణ్య అన్నారు. నగరంలోని ఓ హోటల్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. కిర్గిస్తాన్ దేశంలో ప్రఖ్యాత యూనివర్సిటీ అయిన ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌లో వైద్యవిద్యను తమ సంస్థ అందిస్తుందన్నారు. అత్యుత్తమ ఇండియన్ ఫ్యాకల్టీ వైద్య విద్య బోధిస్తారని, హాస్టల్ వసతి కూడా కలదని తెలిపారు. తమ కళాశాలలో చదివిన విద్యార్థులు దేశంలోని వివిధ ఆసుపత్రుల్లో వైద్యులుగా పని చేస్తున్నారని, ఐఎస్ఎం గైడ్‌లైన్స్‌కు అనుగుణంగా అంతర్జాతీయ స్థాయిలో మంచి శిక్షణ ఇస్తామని చెప్పారు. సమావేశంలో విద్యార్థులు భవాని, ఉష, రాయల్ రతన్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐడీఎస్‌వో ధర్నా

మహారాణిపేట: విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్‌వో) ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. యూనిఫారం పేరిట వ్యాపారాన్ని నిషేధించాలని కలెక్టర్‌కు సమర్పించిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఏఐడీఎస్‌వో సిటీ అధ్యక్షుడు కె.అభిలాష్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీతమ్మధార: ఫిషింగ్ హార్బర్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని విశాఖ ఫిషింగ్ హార్బర్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన 152 కోట్ల రూపాయలతో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై పర్యవేక్షణ ఉండాలని కోరారు. కార్మికుల సమస్యలపై కలెక్టర్‌కు సోమవారం వినతి పత్రం అందించామన్నారు. హార్బర్ కార్మికుల జీవనం దుర్భరంగా ఉందని, వేట సమయంలో చనిపోతున్నా సరైన పరిహారం అందడం లేదని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.20లక్షలు పరిహారం ఇవ్వాలని, లైఫ్ జాకెట్లు ఇవ్వాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. యూనియన్ అధ్యక్షుడు కె.వజ్రం, ఉపాధ్యక్షుడు సి.హెచ్.గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువుదీరిన కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

చూడచక్కగా ఎంవీడీఎం హైస్కూల్



ఎంవీడీఎం హైస్కూల్ ప్రవేశ గేటు వద్ద బడ్డీకొట్లు



ఆకర్షణీయంగా ఎంవీడీఎం ఉన్నత పాఠశాల

- 'నాడు-నేడు'తో అభివృద్ధి
- కార్పొరేటర్ చొరవతో పాఠశాల ముందు బడ్డీకొట్ల తొలగింపు

జగదాంబ: విద్యా రంగానికి అధిక ప్రాధాన్యమిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన మన బడి నాడు-నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. స్కూళ్లలో ఏ లోటు లేకుండా అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా 39వ వార్డులోని కురుపాం మార్కెట్ వద్ద గల జీవీఎంసీ ఎంవీడీఎం ఉన్నత పాఠశాలను చూడచక్కగా తీర్చిదిద్దారు. హైస్కూల్ ప్రవేశ ద్వారం వద్ద ప్రహరీకి ఆనుకుని బడ్డీకొట్లు ఉండేవి. దీని వల్ల ఆకతాయిలు పాఠశాల వద్దకు వచ్చి అనేక అల్లర్లు చేసేవారు. వ్యాపారులు బడ్డీల్లో మద్యంతోపాటు గంజాయి అమ్మకాలు సాగించేవారు. విద్యార్థులు వీరందరినీ దాటుకుని బడిలోకి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనంతటికీ 39వ వార్డు కార్పొరేటర్ మొహమ్మద్ సాధిక్ చరమగీతం పాడారు. పాఠశాల ముందు నుంచి ఆ బడ్డీకొట్లను తీయించారు. స్కూల్ గోడలపై ఆకర్షణీయమైన బొమ్మలు గీయించారు. విద్యార్థులకు బడికి వెళ్లాలనే ఆలోచన తీసుకొచ్చారు. కార్పొరేటర్ చొరవతో ఎంవీడీఎం హైస్కూల్ సుందరంగా మారడంతోపాటు విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందిస్తోంది.

ఆరోగ్య కేంద్రాల్లో ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లు

- వైద్యులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి
- జనాభా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణలో కలెక్టర్ మల్లికార్జున



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, డాక్టర్ రాజేష్

మహారాణిపేట: ప్రపంచ జనాభా దినోత్సవ పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ ప్లానింగ్ శస్త్రచికిత్సలను అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చేయాలని, దీనికి సంబంధించి వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఆయా తేదీలను ఖరారు చేసి ఆపరేషన్లు నిర్వహించాలని చెప్పారు. మధురవాడ, గాజువాక, రేవటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సల కోసం ప్రణాళికలు వేసుకొని ప్రారంభించాలన్నారు. నగరంలోని కేజీహెచ్, వీజీహెచ్‌ల్లో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు జరుగుతున్నాయని, వాటి కన్నా ఎక్కువగా జరగాలని కలెక్టర్ సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ శాశ్వత పద్ధతుల్లో ట్యూబెక్టమీలు 2022-23 సంవత్సరానికి గాను 4,729, వ్యాసెక్టమీలు 44 చేసినట్టు వివరించారు. ఈ నెల 11వ తేదీ మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ కె.రాజేష్, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు అవివేకం

దాబాగార్డెన్స్: జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌కు వలంటీర్లే తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏలూరు బహిరంగ సభలో వలంటీర్లపై పవన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వలంటీర్లు నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయాలని రూ.5 వేల గౌరవ భృతికి అమూల్య సేవలందిస్తుంటే.. పవన్ కల్యాణ్ దిగజారుడు మాటలు మాట్లాడడం అవివేకమన్నారు. దత్త తండ్రి చంద్రబాబు ఇచ్చిన స్క్రిప్ట్ చదవడమే పనిగా పెట్టుకుని రాజకీయాలు చేస్తే ప్రజలు ఎన్నటికీ ఎన్నుకోరన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో వలంటీర్లు తమ ప్రాణాలు పణంగా పెట్టి ప్రజలకు సేవలందించారని గుర్తు చేశారు. కనీసం వార్డు సభ్యుడిగా కూడా గెలవలేని పవన్‌కు కేంద్ర నిఘా వర్గాలు సమాచారం ఇచ్చిందంటే నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరన్నారు.

రహదారులు ఆక్రమిస్తే కఠిన చర్యలు

- ట్రాఫిక్ పోలీసుల హెచ్చరిక
- పూర్ణామార్కెట్‌లో స్పెషల్ డ్రైవ్



మంచాలవీధిలో ఆక్రమణలు తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు పూర్ణామార్కెట్‌లో వన్‌టౌన్ ట్రాఫిక్ పోలీసులు సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పూర్ణామార్కెట్‌తో పాటు అరటిపండ్లు వీధి, బొడారారోడ్డు, మంచాలవీధి, నూనెమిల్లు వీధి, పండుపుల్లల సందు, పూర్ణామార్కెట్ ప్రధాన రహదారిలో ఉన్న ఆక్రమణలు తొలగించారు. వ్యాపారులకు ముందుగా హెచ్చరికలు జారీ చేసి, దుకాణాలు వెనక్కి తీయించారు. అనంతరం ట్రాఫిక్ ఎస్‌ఐ భాస్కరరావు మాట్లాడుతూ రహదారులు ఆక్రమించి, వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. వినియోగదారులకు ఇబ్బంది లేకుండా దుకాణాలు వెనక్కి పెట్టుకోవాలని సూచించారు. మంచాల వీధిలో కర్రల దుకాణ వ్యాపారులు మరోసారి ఆక్రమణలకు పాల్పడితే అపరాధ రుసుముతో పాటు కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

మ్యాక్సీ క్యాబ్ వాహనదారుల నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న మ్యాక్సీ క్యాబ్ వాహనదారులు

మహారాణిపేట: తమ సమస్యలు పరిష్కరించాలని మ్యాక్సీ క్యాబ్ వాహనదారులు డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట జిల్లా మోటార్ వర్కర్స్(ఏఐటీయూసీ) యూనియన్ ఆధ్వర్యంలో వారు నిరసన తెలిపారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.రహ్మాన్ మాట్లాడుతూ పెంచిన వాహన ట్యాక్స్‌ను రద్దు చేయాలని కోరారు. ఇతర సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.

గంగవరం పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార : అదాని గంగవరం పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.జగన్ డిమాండ్ చేశారు. సీఐటీయూ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంగవరం పోర్టులో పేరుకే పర్మినెంట్ ఉద్యోగాలు తప్ప జీతభత్యాలు చాలా దారుణంగా ఉన్నాయన్నారు. పోర్టు నిర్మాణం కోసం నిర్వాసితులు తమ ఇళ్లు, భూమి త్యాగం చేశారన్నారు. వారికి ఉపాధి కల్పిస్తామని, పర్మినెంట్ ఉద్యోగస్తులకు ఇచ్చినట్లే వేతనాలిస్తామని చెప్పి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కలెక్టర్ వద్ద రెండు మార్లు చర్చలు జరిపి, కలెక్టర్ చేసిన సూచనలు అమలు చేయకుండా మొండిగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.ఎం.శ్రీనివాసరావు, ఆర్‌కెఎస్‌వి కుమార్, జీతం కృష్ణారావు, బి.వెంకటరావు, తులసీరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రమట్టి దిబ్బల పరిరక్షణకు 'ఆప్' వినతి

మహారాణిపేట: భీమిలిలోని ఎర్రమట్టి దిబ్బల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు కలెక్టర్‌కు సోమవారం వినతి పత్రం సమర్పించారు. కలెక్టరేట్ బయట ఆందోళన చేపట్టారు. ఎర్రమట్టి దిబ్బలను కాపాడాలని, ఆ ఏరియా పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆప్ జిల్లా కన్వీనర్ షేక్ నాగూర్, రాష్ట్ర మహిళా కన్వీనర్ డాక్టర్ సీతల్ మదన్, కో-ఆర్డినేటర్ సీర రమణ, నిమ్మకాయల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మానవ మృగాలను కఠినంగా శిక్షించాలి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఐద్వా విశాఖ కమిటీ నాయకులు

సీతమ్మధార: విశాఖలో బాలికపై అత్యాచార ఘటనను ఖండిస్తూ, మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఐద్వా విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలోని 104 ఏరియా బాపూజీనగర్‌లో స్థానిక బాలికపై అతిదారుణంగా స్కూల్ అటెండర్, మరో నలుగురు కలిసి లైంగికదాడికి పాల్పడటం బాధాకరమన్నారు. విశాఖలో ఇటువంటి దారుణాలు ఎక్కువవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక వైపు ×బేటీ బచావో.. బేటీ పడావో॰ అనే నినాదంతో ప్రధాని ప్రచారం చేస్తున్నారని, మరో వైపు రాష్ట్ర ప్రభుత్వం దిశా చట్టాన్ని తీసుకొచ్చిందని.. ఆచరణలో మాత్రం మహిళలకు రక్షణ లేకుండా పోతోందన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా త్వరితగతిన విచారణ జరిపి మానవ మృగాలను సమాజంలో తలెత్తుకోకుండా కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న హింసను కట్టడి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర మహిళా కమిషన్ వెంటనే జోక్యం చేసుకుని బాలికకు న్యాయం చేయాలని, పోస్కో చట్టం కింద నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు ఆర్.విమల, మమత, నిర్మల, కె.కుమారి, ఎ.పుష్ప, జి.లక్ష్మి, విజయ, హేమలత, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టండి

దాబాగార్డెన్స్: నగరం నడిబొడ్డున టీఎస్సార్ కాంప్లెక్స్ వద్ద గల ఫ్లై ఓవర్‌పై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని మాజీ కార్పొరేటర్ పచ్చిరపల్లి లక్ష్మి సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. పదేళ్లుగా ఈ బ్రిడ్జిపై అనేక ప్రమాదాలు సంభవించి, పలువురు మృత్యువాత పడగా.. మరికొంత మంది ఆస్పత్రి పాలయ్యారన్నారు. ఇటీవల బ్రిడ్జిపై నుంచి కిందకు పడిపోయి ఇద్దరు యువకులు మృత్యువాత పడ్డారని గుర్తుచేశారు. బ్రిడ్జి ప్రహరీ ఎత్తు పెంచి ఎటువంటి ప్రమాదాలకు తావివ్వకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రజల సహకారంతోనే పర్యావరణ పరిరక్షణ



ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

దాబాగార్డెన్స్: విశాఖలో పర్యావరణ పరిరక్షణకు అందరి సహకారం అవసరమని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ క్యాంప్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో ప్రయాణించి జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం మేయర్ డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ విశాఖ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా, పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు, నగర ప్రజలు, వ్యాపార సంస్థలు, విద్యా సంస్థల యాజమాన్యాలు కాలుష్య నియంత్రణకు సహకరించి, వారంలో ఒక రోజు ప్రజారవాణాను ఉపయోగించాలని కోరారు. ప్రతీ సోమవారం జీవీఎంసీ ఉద్యోగులు ప్రజారవాణా వ్యవస్థను ఉపయోగిస్తున్నారన్నారు.

భూములు కోల్పోయిన పేదలకు ఇళ్లు ఇవ్వండి



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

మహారాణిపేట: కొమ్మాది, బక్కన్నపాలెం రేవళ్లపాలెం గ్రామాల్లో భూములు కోల్పోయిన పేదలందరికీ ఇళ్లు కేటాయించాలని సోమవారం సీపీఎం నాయకులు కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్ మాట్లాడుతూ విశాఖ రూరల్ మండలం జీవీఎంసీ 6వ వార్డులోని కొమ్మాది, బక్కన్నపాలెం, రేవళ్లపాలెం గ్రామాల్లోని పేద, దళిత రైతులకు 1978లో ఇందిరా గాంధీ ప్రభుత్వం ఎకరా చొప్పున 80 కుటుంబాలకు వ్యవసాయ భూములు కేటాయించిందని గుర్తుచేశారు. ప్రభుత్వం వాటిని నవోదయ స్కూలు, వికలాంగుల ఐటీఐ, పట్టుపురుగుల పరిశ్రమ, పోలీస్ శిక్షణ కేంద్రం వంటి నిర్మాణాల కోసం తీసుకుందన్నారు. ఇటీవల జూనియర్ కాలేజీ నిర్మాణ సమయంలో ఈ గ్రామాల రైతులందరూ ఆ ప్రాంతానికి చేరుకొని తమ భూములకు ప్రత్యామ్నాయం చూపాలని ఆందోళన చేపట్టారన్నారు. టీడీపీ హయాంలో నాటి మంత్రి గంటా శ్రీనివాసరావు ఈ భూములకు ప్రత్యామ్నాయంగా ఇళ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారని, నేటికీ అది నెరవేరలేదని పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు బాధితులందరికీ ఇళ్లు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తూ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డి.అప్పలరాజు, సియాద్రి పైడితల్లి, అప్పలరాజు, వెంకయ్యమ్మ, బంగారమ్మ, నరసయ్యమ్మ, దేవుడు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం రూ.35.78 లక్షలు



హుండీ లెక్కింపులో పాల్గొన్న అధికారులు, ధర్మకర్తల మండలి, సిబ్బంది

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో హుండీల ఆదాయ లెక్కింపును సోమవారం నిర్వహించారు. మే 20వ తేదీ నుంచి ఈ నెల 10 వరకు హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు. రూ.35 లక్షల 78 వేల 210 నగదు రాగా, 69 గ్రాముల 500 మిల్లీగ్రాముల బంగారం, 875 గ్రాముల వెండి వచ్చింది. 140 యూఎస్ఏ డాలర్లు, బ్యాంక్ నయాగరాకు చెందిన ఒక రింగట్, యూఏఈకి చెందిన 5 ధీరమ్స్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఒమన్‌కు చెందిన 5వేల రియాల్స్ వచ్చాయి. హుండీ లెక్కింపులో ఆలయ కార్యనిర్వహణాధికారి కె శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు, ఏఈవో తిరుమలేశ్వరరావు, అయ్యప్పనగర్ భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ఈవో పీఎస్ఎన్ మూర్తి, శ్రీహరిసేవా సంఘం సభ్యులు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీనియర్ మేనేజర్ డి.ధనుంజయ్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో నిర్మాణాలు ప్రారంభించాలని ధర్నా



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆటో పార్ట్స్, స్క్రాప్ డీలర్లు

మహారాణిపేట: రాజన్న ఆటోనగర్ పేరుతో మంజూరైన స్థలంలో నిర్మాణ పనులు చేపట్టాలని ఆటో పార్ట్స్, స్క్రాప్ డీలర్లు కోరారు. జిల్లా ఆటోపార్ట్స్ స్క్రాప్ డీలర్స్ అసోసియేషన్, సీపీఎం నాయకులు సంయుక్తంగా సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.గణేష్ మాట్లాడుతూ ఆనందపురం మండలం కణమాం గ్రామం సర్వే నంబర్ 50లో 150 ఎకరాల 77 సెంట్ల భూమిని ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఆ స్థలానికి రాజన్న ఆటోనగర్ పెట్టామని, నిర్మాణ పనులు ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా నేటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. సీపీఎం జగదాంబ జోన్ సెక్రటరీ ఎం.సుబ్బారావు మాట్లాడుతూ కార్మికుల కుటుంబాల జీవనోపాధి కాపాడాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

'జగనన్న సురక్ష'పై అవగాహన



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులోని ఉడ్‌యార్డ్ స్ట్రీట్, ప్రసాద్ గార్డెన్స్, జోనల్ కార్యాలయంలోని సచివాలయాల్లో సోమవారం జగనన్న సురక్షపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న సేవలు అర్హులందరికీ వలంటీర్లు, గృహసారథులు అందజేయాలన్నారు. వార్డులో ఎవరైనా అర్హులైన లబ్ధిదారులు మిగిలి ఉంటే వారికి తప్పనిసరిగా పథకాలను అందజేసే బాధ్యత వలంటీర్లదేనన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందిస్తున్న 11 రకాల సేవలు, సర్టిఫికెట్లు అందరికీ అందేలా చూడాలని కార్పొరేటర్ కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి నీలకంఠం, మంగరాజు, గౌరీశంకర్, వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు పాల్గొన్నారు.

చెత్త తరలింపులో నిర్లక్ష్యంపై కమిషనర్ ఆగ్రహం



ఎంవీపీలో చెత్తతో నిండిపోయిన డస్ట్‌బిన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

ఎంవీపీ కాలనీ: చెత్త తరలింపులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న 18వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం ఆయన జోన్-3 పరిధిలోని ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్డు, సమతా కళాశాల కూడలి ప్రాంతాల్లో పర్యటించారు. సమతా కళాశాల కూడలిలో ఒక డస్ట్‌బిన్ పూర్తిగా చెత్తతో నిండి పోవడాన్ని కమిషనర్ గమనించారు. దీంతో రోజు ఉదయం పూట చెత్త తరలింపునకు వాహనాలు వస్తున్నా తరలింపులో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. పనితీరు మెరుగుపరచుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. తక్షణమే చెత్తను తరలించి వాట్సప్‌లో పోటోలు పెట్టాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ సరిగా జరగడం లేదంటూ కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. చెత్త తరలింపు విషయంలో సిబ్బంది చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని కాలువలను శుద్ధి చేయాలని, దోమల మందులు పిచికారీ చేయాలని సూచించారు పలువురు జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణ సంక్లిష్టమైన ప్రక్రియ

- ఓటు హక్కు వినియోగించుకునే దిశగా చైతన్యం అవసరం
- ఏయూ జర్నలిజం విభాగాధిపతి ఆచార్య మూర్తి



ప్రసంగిస్తున్న ఆచార్య డి.వి.ఆర్.మూర్తి

ఏయూ క్యాంపస్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణ ఎంతో సంక్లిష్టమైన ప్రక్రియ అని ఏయూ జర్నలిజం విభాగాధిపతి ఆచార్య డి.వి.ఆర్.మూర్తి అన్నారు. సోమవారం ఉదయం ఏయూ రాజనీతిశాస్త్ర విభాగం సమావేశ మందిరంలో నిర్వహించిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా భారతదేశంలో ఎన్నికల నిర్వహణ అనే అంశంపై ఆయన మాట్లాడారు. ఓటు హక్కును పూర్తిస్థాయిలో అందరూ వినియోగించుకునే దిశగా ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. 1971లో దేశంలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన సందర్భంలో 17 కోట్ల మందికి ఓటు హక్కు ఉండేదని, నేడు 90 కోట్ల మందికిపైగా ప్రజలకు ఓటు హక్కు ఉందన్నారు. అయితే ఎన్నికల్లో 70 శాతం మంది వరకు మాత్రమే ఓటు హక్కును వినియోగించుకుంటున్నారన్నారు. దేశంలో ఎన్నికల నిర్వహణ సమయంలో ప్రభుత్వం ఒక్కో ఓటుకు సగటున రూ.72 ఖర్చు చేయాల్సిన అవసరం ఏర్పడుతోందన్నారు. 1951లో ఒక్కో ఓటుకు 60 పైసలు ఖర్చు అయ్యేదని తెలిపారు. 1957లో బ్యాలెట్ బాక్సుల ఏర్పాటు, ఓటు వేసినందుకు గుర్తుగా సిరా గుర్తు వేయడం, ఎన్నికల గుర్తుల కేటాయింపు తదితర అంశాలను వివరించారు. ఎన్నికల సంఘానికి ఎన్నికల సమయంలో ఎదురవుతున్న వివిధ సవాళ్లపై అవగాహన కల్పించారు. భారత్‌లో ఈవీఎంల వినియోగం, వీటిపై న్యాయస్థానాలలో వ్యాజ్యాలు వేయడం తదితర అంశాలను తెలియజేశారు. ఎన్నికల సమయంలో పెయిడ్ న్యూస్ అనేది పెద్ద సవాలుగా మారుతోందన్నారు. 2009లో ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు రూ.350 కోట్ల వరకు పెయిడ్ న్యూస్ రూపంలో ఖర్చు చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయన్నారు. ఐఐపీఏ విశాఖ ప్రాంతీయ శాఖ చైర్మన్ ఆచార్య ఆర్.సుదర్శనరావు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు దాదాపు రూ.65 వేల కోట్లు ఖర్చు అవుతుందని, ఇది ఒక రాష్ట్ర ఏడాది బడ్జెట్‌తో సమానమన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐపీఏ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎన్.సాంబశివరావు, కార్యదర్శి పి.ప్రేమానందం, పూర్వ చైర్మన్ ఆచార్య ఇ.ఎ.నారాయణ, సంయుక్త కార్యదర్శి డాక్టర్ సవిత, తదితరులు పాల్గొన్నారు.